గచ్చిబౌలిలో గానాబజానా

సర్కారు చెప్పేదొకటి చేసేదొకటి • అథ్లెటిక్స్ ట్రాక్‌పైనే స్టేజీ నిర్మాణాలు • మండిపడుతున్న క్రీడాభిమానులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: 'ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు..యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు..స్టేడియాల్లో క్రీడా టోర్నీలు తప్పా మిగతా కార్యక్రమాలకు అనుమతివ్వం'. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వల్లె వేస్తున్న మాటలివి. కానీ.. స్వయాన సీఎం చెప్పుతున్నది ఒకటైతే వాస్తవ పరిస్థితి మరోలా ఉంది. నగరం నడిబొడ్డున ఉన్న ఎల్బీ స్టేడియాన్ని ఇప్పటికే పూర్తిగా ప్రభుత్వ, రాజకీయ కార్యక్రమాలకు వేదికగా మార్చిన ప్రభుత్వం..తాజాగా గచ్చిబౌలి స్టేడియాన్ని ప్రైవేట్ ఈవెంట్లకు అడ్డాగా మార్చేందుకు అడుగులు వేస్తున్నది. ఈ మధ్యే దాదాపు రూ.20 కోట్లు పెట్టి గచ్చిబౌలి ఫుట్‌బాల్ స్టేడియానికి రంగులద్దిన ప్రభుత్వం..ఇప్పుడు సంగీత విభావరి కార్యక్రమానికి పచ్చజెండా ఊపింది. టాలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్ 'రాక్‌స్టార్ డీఎస్పీ' పేరిట హైదరాబాద్‌లో లైవ్ కన్సర్ట్‌ను ఈనెల 19న అట్టహాసంగా నిర్వహించబోతున్నారు. ఇందుకోసం ఇప్పటికే గచ్చిబౌలి ఫుట్‌బాల్ స్టేడియంలో పనులు హడావుడిగా జరుగుతున్నాయి. అథ్లెట్లు ప్రాక్టీస్ చేసే సింథటిక్ ట్రాక్‌పైనే స్టేజి నిర్మాణం చేస్తున్నారు. ఇందుకు పెద్ద పెద్ద గుంతలు తవ్వుతున్నారు. ఇది వరకే ఆధ్వానస్థితిలో ఉన్న ట్రాక్‌పై ఇలాంటి నిర్మాణాలు చేయడంతో పూర్తిగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని అథ్లెట్లు ఓవైపు ఆందోళన చెందుతున్నారు. క్రీడా టోర్నీలు జరుగాల్సిన స్టేడియంలో సంగీత కార్యక్రమాలు ఏంటని క్రీడాభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యే 'సీఎం కప్' ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటాలను ఈ సందర్భంగా గుర్తుకు తెస్తున్నారు. చెప్పేదొకటైతే.. చేసేదొకటా అన్న రీతిలో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరును విమర్శిస్తున్నారు. నగరంలో ఇప్పటికే డీజేలపై నిషేధం కొనసాగుతున్న వేళ..దీనికి ఎలా అనుమతిచ్చారని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే దేవీశ్రీప్రసాద్ బుధవారం స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కలిసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం ఇందులో కొసమెరుపు.

గచ్చిబౌలిలో జరిగే సంగీత విభావరికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్‌లో ఆహ్వానిస్తున్న సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్

అఖిల్‌కు కాంస్యం

ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్

ఢిల్లీ: ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) వరల్డ్‌కప్ ఫైనల్- 2024లో భారత షూటర్ అఖిల్ శ్యోరనా కాంస్యం గెలిచాడు. ఢిల్లీలో జరుగుతున్న ఈ టోర్నీలో అఖిల్.. బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో 452.6 పాయింట్లు స్కోరు చేసి కాంస్యం సొంతం చేసుకున్నాడు. గతేడాది ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన అతడు.. తాజాగా కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.

త్రిసా-గాయత్రి జోడీ ఓటమి

ఓడెన్స్: డెన్మార్క్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో రెండో రోజూ భారత్‌కు నిరాశజనక ఫలితాలే వచ్చాయి. మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్ జోడీ 21-19, 17-21, 15-21తో పీర్లీ టాన్, మురళీధరన్ తిన్నా(మలేషియా) చేతిలో పోరాడి ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్-సిక్కి రెడ్డి జంట.. 22-20, 19-21, 22-24తో కెవిన్ లీ, ఎలియానా ఝుంగ్ (కెనడా) చేతిలో ఓటమి పాలయ్యింది.

యాషెస్ సిరీస్ షెడ్యూల్ విడుదల

సిడ్నీ: ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య జరిగే చారిత్రక యాషెస్ టెస్టు సిరీస్ తదుపరి ఎడిషన్ (2025-26)కు సంబంధించిన షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) ప్రకటించింది. వచ్చే ఏడాది నవంబర్ 21 నుంచి జనవరి 8 దాకా ఈ సిరీస్ జరుగనుంది. నవంబర్ 21-25న జరిగే తొలి టెస్టుకు పెర్త్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. యాషెస్ టెస్టు సిరీస్ ప్రారంభ మ్యాచ్‌కు వేదికగా వ్యవహరించనుండటం పెర్త్‌కు నాలుగు దశాబ్దాల తర్వాత ఇదే ప్రథమం. గబ్బా (రెండో), అడిలైడ్(మూడో), మెల్‌బోర్న్ (నాల్గో), సిడ్నీ(ఐదో) సిరీస్‌కు ఆతిథ్యమిస్తున్నాయి.

ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో నీతూ డేవిడ్

• కుక్, డివిలియర్స్ కూడా..

దుబాయ్: భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ స్పిన్నర్ నీతూ డేవిడ్‌కు అత్యున్నత గౌరవం లభించింది. ఆమెకు ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. నీతూతో పాటు ఇంగ్లండ్ మాజీ సారథి అలెస్టర్ కుక్, దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్‌నూ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చేర్చుతున్నట్టు ఐసీసీ వెల్లడించింది. ప్రస్తుతం టీమ్‌ఇండియా మహిళా క్రికెట్ జట్టుకు చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరిస్తున్న నీతూ డేవిడ్.. డయానా ఎడుల్జి తర్వాత భారత్ నుంచి ఈ ఘనత దక్కించుకున్న రెండో మహిళా క్రికెటర్. భారత్ తరపున 10 టెస్టులు, 97 వన్డేలు ఆడిన నీతూ.. వన్డే ఫార్మాట్‌లో వంద వికెట్లు తీసిన తొలి మహిళా బౌలర్ (టీమ్‌ఇండియా నుంచి)గా రికార్డులకెక్కింది. అంతర్జాతీయ క్రికెట్‌లో 20వేలకు పైగా పరుగులు చేసిన కుక్‌తో పాటు క్రికెట్ ఫ్యాన్స్ 'మిస్టర్ 360'గా పిలుచుకునే డివిలియర్స్‌కూ ఈ గుర్తింపు దక్కింది.

ఢిల్లీలో ఖో ఖో ప్రపంచకప్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఖో-ఖో ప్రపంచకప్ టోర్నీకి భారత్ తొలిసారి ఆతిథ్యమివ్వబోతున్నది. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 19 వరకు ఢిల్లీలో ఖో ఖో ప్రపంచకప్ జరుగుతుందని నిర్వహకులు పేర్కొన్నారు. బుధవారం ప్రత్యేకంగా ఏర్పాటు కార్యక్రమంలో మహారాష్ట్ర, రెస్టాఫ్ ఇండియా జట్ల మధ్య ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచకప్ అధికారిక లోగ్తో పాటు ట్యాగ్‌లైన్‌ను విడుదల చేశారు. ఈ మెగాటోర్నీలో మొత్తం పురుషుల, మహిళల జట్లు కలిపి 24 బరిలోకి దిగుతున్నాయి. కేకేఎఫ్ఐ అధ్యక్షుడు సుదాంశు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపాడు.

భారత నెట్‌బాల్ కోచ్‌గా విక్రమాదిత్య

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెంగళూరు వేదికగా జరుగనున్న 13వ మహిళల ఏషియన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పోటీపడే భారత జట్టుకు మహబూబ్‌నగర్‌కు చెందిన విక్రమాదిత్యరెడ్డి కోచ్‌గా ఎంపికయ్యాడు. రాష్ట్ర నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న విక్రమాదిత్య..జాతీయ జట్టుకు సేవలందించనున్నాడు.

డకెట్ సెంచరీ

ముల్తాన్ టెస్టు

ముల్తాన్: పాకిస్థాన్ పర్యటనలో ఇంగ్లండ్ జోరు కొనసాగుతోంది. ముల్తాన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్‌ను 366 పరుగులకే కట్టడి చేసిన బెన్ స్టోక్స్ సేన.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 53 ఓవర్లలోనే 6 వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. ఓపెనర్ బెన్ డకెట్ (114) శతకంతో చెలరేగగా జో రూట్ (34) రాణించాడు. అయితే రెండో రోజు చివరి సెషన్‌లో మరో 10 ఓవర్లు అయితే ఆట ముగుస్తుందనగా ఇంగ్లీష్ జట్టు వెంటవెంటనే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. స్పిన్నర్ సాజిద్ ఖాన్.. రూట్, బ్రూక్ (9), బెన్ స్టోక్స్ (1), డకెట్‌ను ఔట్ చేసి పర్యాటక జట్టును కష్టాల్లోకి నెట్టాడు.

వాన ఆగలె.. ఆట సాగలె

భారత్, కివీస్ తొలి టెస్టు మొదటి రోజు వర్షార్పణం • బెంగళూరులో రోజంతా వాన • రెండో రోజూ అనుమానమే?

బెంగళూరు: భారత్, న్యూజిలాండ్ మధ్య బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా బుధవారం నుంచి మొదలు కావాల్సిన తొలి టెస్టుకు అందరూ అనుకున్నట్టుగానే వరుణుడు తీవ్ర అంతరాయం కలిగించాడు. గత రెండ్రోజులుగా బెంగళూరులో జోరుగా కురుస్తున్న వాన.. తొలి టెస్టులో టాస్ కూడా పడనివ్వకుండా అడ్డుకుంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా అక్కడ కురిసిన వర్షంతో మొదటి రోజు టాస్ పడకుండానే ఆట రద్దైంది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా మ్యాచ్ చూద్దామని వచ్చిన ప్రేక్షకులకు నిరాశే ఎదురైంది. బెంగళూరుకు గురువారమూ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రెండో రోజూ ఆట సాగడం అనుమానంగానే ఉంది.

రోజంతా అదే కథ..

మంగళవారం ఉదయం నుంచే బెంగళూరులో వరుణుడు తన ప్రతాపం చూపించాడు. ఉదయం 10:30 గంటలకు వరుణుడు కొద్ది సేపు తెరిపినిచ్చినా మరో అరగంటకు అదే కథ పునరావృతమైంది. తొలి సెషన్ ముగిశాక మరోసారి వాన ఆగడంతో గ్రౌండ్ సిబ్బంది ప్రధాన పిచ్‌పై కవర్లను తొలిగించే యత్నం చేశారు. దీంతో మధ్యాహ్నం 2 గంటలకు మ్యాచ్ నిర్వాహకులు ఔట్ ఫీల్డ్‌ను పరిశీలించేందుకు వచ్చి కాసేపు మైదానం అంతా కలియతిరిగారు. ఇదే సమయంలో కోహ్లీ, జైస్వాల్ మైదానంలోకి వచ్చి ప్రేక్షకులకు అభివాదం చేశారు. కానీ కొద్దిసేపటికే మళ్లీ కుండపోత వర్షం కురవడంతో మధ్యాహ్నం 2.34 గంటలకు తొలి రోజు ఆటను రద్దుచేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. వర్షం కురవకుంటే మైదానాన్ని ఆరబెట్టేందుకు చిన్నస్వామిలో అత్యాధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నప్పటికీ వరుణుడు పదే పదే అంతరాయం కలిగించడంతో తొలి రోజు ఆట సాగలేదు.

రెండో రోజు ఆట సమయంలో మార్పులు

తొలి రోజు ఆట వర్షార్పణమైన నేపథ్యంలో రెండో రోజు 15 నిమిషాల ముందే మ్యాచ్ ఆరంభం కానుంది. వరుణుడు కరుణిస్తే ఉదయం 8.45 గంటలకు టాస్ వేయనుండగా తొలి సెషన్ 9.15 నుంచి 11.30 వరకు సాగనుంది. రెండో సెషన్ మధ్యాహ్నం 12.10 గంటలకు మొదలై 2.45 దాకా ఉండనుంది. మూడో సెషన్‌ను మధ్యాహ్నం 2.45 నుంచి సాయంత్రం 4.45 దాకా ఆడించనున్నారు.

'అఖండ' సీక్వెల్ ప్రారంభం

తెలుగు ఇండస్ట్రీలో అగ్ర కథానాయకుడు బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీనులది సూపర్‌హిట్ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో వచ్చిన సింహా, లెజెండ్, అఖండ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సాధించాయి. ముఖ్యంగా 'అఖండ' చిత్రం వందకోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. దీంతో ఈ సినిమా సీక్వెల్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. అభిమానుల నిరీక్షణకు తెరదించుతూ 'అఖండ-2' బుధవారం ఘనంగా ప్రారంభమైంది. నందమూరి తేజస్విని సమర్పణలో 14రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి బ్రహ్మణి క్లాప్‌నివ్వగా, తేజస్విని కెమెరా స్విఛాన్ చేశారు. యూనివర్సల్ అప్పీల్ ఉన్న పవర్‌ఫుల్ స్క్రిప్ట్ ఇదని, తొలి భాగానికి మించిన ఎమోషన్స్, యాక్షన్ ఘట్టాలుంటాయని, బాలకృష్ణ పాత్ర మరింత శక్తివంతంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ప్రగ్యా జైస్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సి.రాంప్రసాద్, సంతోష్ డి డెటాకే, ఆర్ట్: ఏ.ఎస్.ప్రకాష్, సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కోటి పరుచూరి, రచన-దర్శకత్వం: బోయపాటి శ్రీను.

'ఆదిశంకరాచార్య' జీవన ప్రస్థానం

జగద్గురు ఆదిశంకరాచార్య జీవన ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించిన 'ఆదిశంకరాచార్య' వెబ్‌సిరీస్ ట్రైలర్‌ను దసరా పర్వదినం రోజున ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..ఆదిశంకరుడు భారతీయ ప్రాచీన వేద విజ్ఞానాన్ని పునరుజ్జీవింపజేసిన మహామనిషి అని కొనియాడారు. ఆదిశంకరుడి బాల్య జీవితం, భారతీయ ఆధ్యాత్మిక వైభవ పునరుద్ధరణకు ఆయన చేసిన కృషిని ఈ సిరీస్‌లో ఆవిష్కరించామని, మొదటి సీజన్లో 40 నిమిషాల నిడివిగల 10 ఎపిసోడ్లు ఉంటాయని, వీటిలో ఆదిశంకరుని జననం నుంచి ఎనిమిది ఏండ్ల వయసు వరకు జరిగిన సంఘటనలను చూపించామని చిత్ర బృందం తెలిపింది. భారతదేశ సాంస్కృతిక వికాసానికి ఆదిశంకరాచార్యులు చేసిన కృషి వెలకట్టలేనిదని ఈ సిరీస్ దర్శకుడు ఓంకార్‌నాథ్ మిశ్ర పేర్కొన్నారు. నవంబర్ 1 నుంచి 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' యాప్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.

ఇద్దరు పోటీ పడితే..



యాక్షన్‌కింగ్ అర్జున్, జేడీ చక్రవర్తి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఇద్దరు'. ఎస్.ఎస్.సమీర్ దర్శకుడు. ఫాతిమా నిర్మాత. ఈ నెల 18న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకనిర్మాత సమీర్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. అర్జున్, జేడీ చక్రవర్తి పోటీపడి నటించారు. విభిన్న కథాంశంతో తెరకెక్కించాం. రాధిక కుమారస్వామి, సోనీచరిష్టా కథానాయికలుగా నటించారు. కళాతపస్వి కె.విశ్వనాథ్‌గారు నటించిన చివరి సినిమా ఇది. ఆయన పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, దర్శకుడు: ఎస్.ఎస్.సమీర్.

చిత్రం

ఇప్పటికీ అలాగే ఉన్నా!

అగ్ర కథానాయిక సమంత నటించిన 'సిటాడెల్' వెబ్‌సిరీస్ ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. ఇందులో ఆమె గూఢచారి పాత్రలో కనిపించింది. స్పై ఏజెంట్‌గా మారక ముందు సినీ నటి కావాలనే ప్రయత్నాలు చేసినట్లు ట్రైలర్‌లో చూపించారు. ఈ సీన్ గురించి ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడింది. ఈ సందర్భంగా తన తొలి సినిమా 'ఏ మాయ చేశావే' ఆడిషన్‌ను గుర్తుచేసుకుంది. 'ఈ సిరీస్‌లో నేను ఆడిషన్ ఇచ్చే ఓ సన్నివేశం ఉంది. అందులో నేను నటనరాని అమ్మాయిగా కనిపించాలి. సింగిల్‌టేక్‌లోనే ఆ సీన్ ఓకే అయింది. ఎందుకంటే నేను ఇప్పటికీ యావరేజ్ నటినే (నవ్వుతూ). ఇంకా నటనలో పరిణితి సాధించే పనిలో ఉన్నాను. అయితే నా ఫస్ట్‌మూవీ 'ఏ మాయ చేశావే' కోసం మాత్రం అద్భుతంగా ఆడిషన్ ఇచ్చాను' అని చెప్పింది సమంత. తన కెరీర్‌లో ఎన్నో విజయాలు ఉన్నా అవన్నీ టీమ్ ఎఫర్ట్స్ అని ఆమె పేర్కొంది. 'ఒక సినిమా వెనక ఎంతో మంది నిపుణుల కృషి ఉంటుంది. మంచి టీమ్ ఉన్నప్పుడే మన ప్రతిభ బయటకు వస్తుంది. అదృష్టం కొద్ది నేను ప్రతిభావంతులైన నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి పని చేశాను' అని తెలిపింది. 'సిటాడెల్' సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

కథ విని కన్నీళ్లొచ్చాయి

'పొట్టేల్' సినిమా అంతా రా అండ్ రస్టిక్‌గా ఉంటుందని, కథానుగుణంగా మంచి మ్యూజిక్ కుదిరిందని చెప్పారు చిత్ర సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర. యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో రూపొందిన 'పొట్టేల్' చిత్రం ఈ నెల 25న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర మాట్లాడుతూ 'ఈ కథ విన్నప్పుడు షాక్ అయ్యాను. ఉద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లొచ్చాయి. పిల్లల చదువు కోసం పేరెంట్స్ ఎంత కష్టపడతారో అనే అంశాన్ని ఈ సినిమాలో హృద్యంగా చూపించారు. గ్రామీణ నేపథ్యంలో ఈ కథ మనసుకు హత్తుకునేలా ఉంటుంది' అన్నారు. ఈ సినిమాలో ప్రతీ సన్నివేశం చాలా సహజంగా ఉంటుందని, అందుకు తగినట్లుగానే మ్యూజిక్ అందించానని, కాసర్ల శ్యామ్ అర్థవంతమైన సాహిత్యాన్ని అందించారని ఆయన తెలిపారు. ' ఇందులో మొత్త నాలుగు పాటలుంటాయి. ప్రతీ పాట కథలోని సారాన్ని తెలియజెప్పేలా ఉంటుంది' అని శేఖర్‌చంద్ర పేర్కొన్నారు.

మ్యూజిక్ చేసే 'మ్యాజిక్'

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ రూపొందిస్తున్న తాజా చిత్రం 'మ్యాజిక్'. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 21న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. సంగీత నేపథ్య కథాంశమిదని, కాలేజీ ఫెస్టివల్ కోసం సొంతంగా ఒక పాటను కంపోజ్ చేయడానికి నలుగురు యువకులు చేసే ప్రయత్నం చుట్టూ కథ నడుస్తుందని దర్శకుడు తెలిపారు. తమ కల నెరవేర్చుకోవడానికి మిత్రబృందం చేసే అందమైన ప్రయాణం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్నందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు.

'స్పిరిట్'లో డ్యూయల్ రోల్?

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న 'స్పిరిట్' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. ప్రస్తుతం ప్రీపొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా డిసెంబర్‌లో సెట్స్ మీదకు వెళ్లనున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. కెరీర్‌లో తొలిసారి ఆయన పోలీస్ పాత్రను చేస్తుండటం విశేషం. ఈ సినిమాలో చాలా సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ ఉండబోతున్నాయని తెలిసింది. ఇందులో ప్రభాస్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారని చెబుతున్నారు. 'బాహుబలి'లో ప్రభాస్ డ్యూయల్ రోల్‌ని పోషించినా..రెండు పాత్రలు తెరపై ఒకేసారి కనిపించలేదు. 'స్పిరిట్' చిత్రంలో మాత్రం రెండు క్యారెక్టర్స్ ఒకేసారి కనిపిస్తాయని చెబుతున్నారు. మరో విశేషమేమిటంటే ఈ సినిమాలో రణబీర్‌కపూర్, విజయ్ దేవరకొండ గెస్ట్ రోల్స్‌లో కనిపిస్తారని అంటున్నారు. వీరితో పాటు ఇద్దరుముగ్గురు స్టార్ హీరోలు ఈ సినిమాలో మెరిసే అవకాశం ఉందని సమాచారం. అయితే ఈ వార్తల్లో నిజానిజాలేమిటో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

ఉత్తర తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా సెట్

ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్య కథాంశంతో హీరో శర్వానంద్ ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సంపత్‌నంది దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. శర్వానంద్ నటిస్తున్న 38వ చిత్రమిది. తాజాగా ఈ సినిమా కోసం 15 ఎకరాల్లో భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు. బుధవారం భూమి పూజతో సెట్ వర్క్‌ను మొదలుపెట్టారు. ఉత్తర తెలంగాణ సంస్కృతిని, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా సెట్‌ను తీర్చిదిద్దబోతున్నారు. కళా దర్శకుడు కిరణ్ కుమార్ నేతృత్వంలో ఈ సెట్‌కు రూపకల్పన చేస్తున్నామని, ఇందులో ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాలను చిత్రీకరిస్తామని మేకర్స్ తెలిపారు. 1960 దశకంలో నడిచే పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇదని, ప్రేక్షకుల్ని ఆనాటి కాలంలోకి తీసుకెళ్తుందని, హీరో శర్వానంద్ సరికొత్త మేకోవర్‌లో కనిపిస్తారని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: సంపత్‌నంది.

ముక్కోణపు ప్రేమాయణం

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. నవంబర్ 22న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నెల 20న ట్రైలర్‌ను లాంచ్ చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'విశ్వక్‌సేన్ గత చిత్రాలకు భిన్నంగా ఉండే కథ ఇది. చక్కటి కామెడీతో పాటు రోమాంచితమైన యాక్షన్‌తో ఆకట్టుకుంటుంది. ముక్కోణపు ప్రేమాయణం కథలో ఆసక్తికరంగా అనిపిస్తుంది. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. జేక్స్ బిజోయ్ అద్భుతమైన సంగీతాన్నందించారు' అని చిత్రబృందం తెలిపింది. శ్రద్ధాశ్రీనాథ్, నరేష్, వైవా హర్ష తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: రవితేజ ముళ్లపూడి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.